

హుస్నాబాద్ మండలం నాగారంలో అడుగంటిన వ్యవసాయ బావి


బెజ్జంకి మండలం ముత్తన్నపేటలో నీటి కొరతతో నెర్రెలువారిన పొలం

ముత్తన్నపేట శివారులో బోరు నుంచి సన్నటి నీటి ధార

అడుగంటిన ఆశలు

- జిల్లాలో పడిపోతున్న భూగర్భజలాలు
- వేసవి తొలినాళ్లలోనే సాగునీటి కష్టాలు
- బోర్లు, బావుల్లో అంతంతమాత్రంగానే ఊట
- నీరందక ఎండిపోతున్న పంటలు
- గోదావరి జలాలను ఎత్తిపోస్తేనే ఊరట

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 9 : నంగునూరు మండలం పాలమాకులకు చెందిన రైతు సత్యనారాయణ తనకున్న మూడెకరాల్లో వరిని సాగు చేస్తున్నాడు. ఇందుకు సుమారు రూ.70వేల దాకా పెట్టుబడి పెట్టాడు. అయితే బావిలో నీరు అడుగంటడంతో నీటి కొరత ఏర్పడింది. ప్రస్తుతం రెండెకరాలకే నీరందుతోంది. ఈ క్రమంలో ఎకరం పొలం ఎండిపోగా తన పాడిగేదె మేస్తూ కనిపించింది. ఇదే పరిస్థితి ఉంటే మిగతా రెండు ఎకరాలు కూడా ఎండిపోతుందని ఆవేదన చెందాడు. గతేడాది చెరువుల్లోకి సమృద్ధిగా నీరు విడుదల చేయడంతో మూడెకరాల్లో పంట పండిందని చెప్పాడు.

ఈ దుస్థితి రైతు సత్యనారాయణ ఒక్కరిదే కాదు. యాసంగిలో వరి సాగు చేస్తున్న చాలా మంది రైతులది ఇదే గాధ. నాలుగైదేళ్లుగా యాసంగిలో పంట పండుతుండటంతో ఈసారి ముందడుగు వేశారు. కానీ, భూగర్భజలాలు అడుగంటడం, గోదావరి జలాల ఎత్తిపోతలు నిలిచిపోవడంతో సాగునీటికి తీవ్ర కటకట మొదలైంది.

పాతాళంలోకి భూగర్భజలాలు

నాలుగేళ్ల నుంచి సమృద్ధిగా ఉంటున్న భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. జిల్లాలో సగటున గతేడాది ఇదే సమయంలో 8.66 మీటర్ల లోతున ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం 10.07 మీటర్ల అడుగులోకి చేరాయి. వేసవి ఆరంభంలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఇంకెలాంటి దుస్థితి ఏర్పడుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది మే నెలలో 10.82 మీటర్ల లోతున భూగర్భజలాలు ఉండగా మూడు నెలల ముందుగానే జిల్లాలో ఆ పరిస్థితి దాపురించింది. ఫిబ్రవరి మూడో వారం నుంచి ఎండలు ప్రారంభం కావడంతోనే భూగర్భజలాలు పాతాళం దిశగా అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రిజర్వాయర్ల ద్వారా నీటిని చెరువులు, చెక్‌డ్యాములు, కుంటలు, వాగుల్లోకి తరలించాలి. ఇలా చేయడం వల్ల కొంతవరకైనా భూగర్భజలాల స్థాయిని పెంచే ఆస్కారం ఉంటుంది.

ఎత్తిపోతలపైనే ఆశ

జిల్లాలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.9 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో 3 టీఎంసీల సామర్థ్యంతో నిండుగా ఉంది. దీంతో ముందస్తుగానే నీటిని విడుదల చేశారు. మళ్లీ చివరి దశలో మరొక్కసారి నీరు విడుదల చేయడంతో పంటలు చేతికొచ్చాయి. అయితే ప్రస్తుతం ఉన్న నీటితో రెండుసార్లు కాలువల్లోకి నీటిని విడుదల చేసే పరిస్థితి లేదు. ఒకవేళ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్‌మానేరు నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తేనే ఈ పరిస్థితిని అధిగమించే అవకాశం ఉంది. లేదంటే దాదాపు 50వేల ఎకరాల సాగు ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పటికే వరి పంటలకు నాలుగు రోజులకోసారి తడులు పారిస్తూ పంటలను నెట్టుకువస్తున్నారు. ఇక మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లో నిల్వ ఉన్న నీటితో యాసంగి సాగుకు కొంత ఉపశమనం కలుగుతుంది. గడిచిన వానాకాలంలో నీటిని ఎత్తిపోయడంతో ఈ రెండు రిజర్వాయర్లు సేఫ్ జోన్‌లో ఉన్నాయి. అయితే, రంగనాయకసాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని ఇప్పటికిప్పుడు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నంగునూరు మండలం పాలమాకుల శివారులో ఎండిన పొలంలో మేస్తున్నగేదె

కొత్త బోర్లు.. బావుల్లో పూడికతీత

పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల అక్కన్నపేట మండలంలోని ఓ రైతు ట్యాంకరు ద్వారా నీళ్లను తెచ్చి వరి పొలానికి పారించారు. పలు చోట్ల ఇదే పద్ధతిని ఆచరిస్తున్నారు. ఇక కొత్త బోర్లపై కూడా దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ భూముల వద్ద, గృహ అవసరాల కోసం బోరు బండ్లకు గిరాకీ పెరిగింది. సిద్దిపేట పట్టణంలో వెయ్యి ఫీట్ల లోతు వరకు బోరు వేసినా అంతంతమాత్రంగానే నీళ్లు వస్తున్నట్లు చెబుతున్నారు. ఇక వ్యవసాయ భూముల వద్ద బావుల్లో పూడికతీత పనులు ఆరంభించారు. వరిపంట పొట్టదశకు చేరుకునే వరకు సమృద్ధిగా నీళ్లు ఉండేలా చూసుకుంటున్నారు.


చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులోని బావిలో పూడికతీత

పొట్ట దశలో వరి.. రెండుబోర్లు ఎత్తేసినయ్



రెండు బోర్లలో నీళ్లు ఉన్నాయని ఆరు ఎకరాల్లో వరి సాగు చేసిన. చెరువుల నీళ్లు మొత్తం ఎండిపోగానే రెండు బోర్లు ఎత్తిపోయినయ్. వరి పొట్ట దశలో ఉంది. ఇప్పటికే లక్షకుపైగా పెట్టుబడి దాటిపోయింది. నీళ్లు రాకపోతే తీవ్రంగా నష్టపోయి అప్పులే గతైతయి. అధికారులు స్పందించి వెంటనే పంటకు నీళ్లు ఇవ్వాలి.

- నాంపల్లి శ్రీనివాస్, రైతు, శేఖర్‌రావుపేట, నారాయణరావుపేట మండలం

నల్లేనే ప్రాంత పంటలు ఎండిపోతున్నాయి



పక్కనే ఉన్న పాంచెరువులో చుక్క నీరు లేదు. కాలువలతో వచ్చే నీళ్లు వస్తలే. నల్లేనే, నంది కాలువ ప్రాంతంలో 150 ఎకరాల్లో వరి ఎండిపోతున్నది. రంగనాయకసాగర్ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలని ఎవరికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. రైతులు పెద్దచెరువు మత్తడినీళ్లు సైతం రాని పరిస్థితి. వెంటనే పంటలకు నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలి.

- దండు శంకర్, రైతు, నారాయణరావుపేట


నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ ఎండిన ఎర్రకుంట

రెండు చోట్ల కాంగ్రెస్ ఉంటే మరింత అభివృద్ధి

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కొండపాక, మార్చి 9 : రాష్ట్రంతో పాటు కేంద్రంలోనూ కాంగ్రెస్ పాలన ఉంటే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనంతుల పద్మనరేందర్‌తోపాటు కొండపాక, కుకునూరుపల్లి మండలాలకు చెందిన వివిధ గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల అహంకారపూరిత పాలనలో ప్రజలంతా విసిగిపోయి చరమగీతం పాడారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ వంటి పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు రాబట్టడానికి కృషి చేస్తున్నాడన్నారు. డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ దశాబ్దకాలంగా అధికారం లేకున్నా కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు అన్యాయం చేయమన్నారు. అధైర్యపడాల్సిన అవసరం లేదని, అందరికీ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కొండపాక, కుకునూరుపల్లి మండలాల అధ్యక్షులు వాసవి లింగారావు, విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డమైన రవీందర్, అనంతుల శ్రీస్మిత, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్నశ్రీనివాస్, ఐలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోనే మంటలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడి భగభగలు
- సిద్దిపేట జిల్లా దుబ్బిట్టలో అత్యధికంగా 39.7 డిగ్రీలు



మెదక్ అర్బన్, మార్చి 9: వేసవి ప్రారంభంలోనే భానుడు భగభగమంటున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. మార్చి నెల ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువయ్యాయి. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బిట్టలో 39.7 డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదయింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 39.3 డిగ్రీలు, మెదక్ జిల్లా దామరంచలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు...

- సిద్దిపేట జిల్లా దుబ్బిట్టలో అత్యధికంగా 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా... అంగడికిష్టాపూర్‌లో 39.4 డిగ్రీలు, తుక్కాపూర్‌లో 38.4 డిగ్రీలు, ములుగులో 38.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 39.3 డిగ్రీలు, సదాశివపేటలో 38.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- మెదక్ జిల్లా దామరంచలో 39 డిగ్రీలు, చిన్నశంకరంపేటలో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రోడ్లు నిర్మానుష్యం

ఉదయం 10 గంటలు దాటితే జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బయట వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న సమయంలో రోడ్లు, మార్కెట్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చిన్నారులు, వృద్ధులు పదిలం

ఉమ్మడి జిల్లాలో ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్నందున తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు రక్షణ చర్యల్ని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు డీహైడ్రేషన్‌కు గురవుతుంటారని పేర్కొంటున్నారు. వడదెబ్బ బారిన పడే ప్రమాదం కూడా ఉండడంతో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో లవణాలు తగ్గకుండా ఉండటానికి పండ్ల రసాలు, మజ్జిగ తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి అయితే తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండలోకి వెళ్లాలని సూచిస్తున్నారు.


ఏడుపాయల ఆలయ వీధుల్లో గుమ్మటాల బండ్లు

బండెనక బండి..

ఏడుపాయలలో వైభవంగా బండ్ల ఊరేగింపు

పాపన్నపేట, మార్చి 9 : ఏడుపాయల జాతరలో బండ్ల ఊరేగింపు క్రతువు అంగరంగ వైభవంగా కొనసాగింది. మెదక్ జిల్లాలోని ఏడుపాయల జాతర రెండోరోజు శనివారం సాయంత్రం వనదుర్గామాతకు 100 బండ్లతో ఊరేగింపును నిర్వహించారు. జోడెడ్లను, బండ్లను రంగులతో అలంకరించారు. కొబ్బరిమట్టలు, పట్టుచీరలు, మామిడాకులతో తీర్చిదిద్దారు. ఎరుపు రంగు కాగితాలతో తయారు చేసిన ధగధగలాడుతున్న గుమ్మటాల బండ్లు జాతరకే ఆకర్షణగా నిలిచాయి. బండ్లపై శివసత్తులు చెర్లకోలలు పట్టుకుని శిగాలు ఊగుతుండగా డప్పుచప్పుళ్లకనుగుణంగా చిందులేస్తుంటే ఏడుపాయల గుట్టలు ప్రతిధ్వనించాయి. అనాదిగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండికి చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, ధర్మకర్తలు, స్థానిక నాయకులు స్వాగతం పలకారు. జిల్లా అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుంటూనే ఉన్నారు. బండ్ల ఊరేగింపును తిలకించటానికి లక్షల్లో భక్తులు ఏడుపాయలకు తరలివచ్చారు. అడుగడుగునా బోనాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు, మొక్కులు చెల్లించుకోవడం కనిపించింది.


బారులుతీరిన ఎడ్ల బండ్లు


ఢమరుకం, త్రిశూలం, బోనాలు తీసుకొస్తున్న ఒగ్గు పూజారులు


మైలపోలు తీస్తున్న ఒగ్గు పూజారులు, ఈవో బాలాజీ


భక్తులపై లాఠీ ఝుళిపిస్తున్న పోలీసులు


పెద్దపట్నం తిలకించేందుకు హాజరైన భక్తులు


ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం

పరవశం

కొమురవెల్లిలో కన్నులపండుగగా పెద్దపట్నం

- 150 మంది ఒగ్గుపూజారులు, 41 వరుసలతో పట్నం
- తిలకించి పులకించిన భక్తులు
- మల్లన నామస్మరణతో మార్మోగిన తోటబావి ప్రాంగణం

కొమురవెల్లి, మార్చి 9 : కొమురవెల్లి మల్లికార్జునస్వామికి అత్యంత వైభవంగా పెద్దపట్నం వేశారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున ఆలయ తోటబావి ప్రాంగణం వద్ద యాదవుల సంప్రదాయ ప్రకారం మల్లన్నకు ఘనంగా లగ్గం నిర్వహించారు. లింగోద్భవ సమయంలో గర్భగుడిలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. ముందుగా ఒగ్గుపూజారులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం స్వామికి కోనేరులో తెప్ప స్నానం, సుంకుపట్టి, మైలపోలు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తోటబావి ప్రాంగణంలో స్వామివారి త్రిశూలం, ఢమరుకం ప్రతిష్ఠించారు. అనంతరం ఒగ్గు పూజారుల సంఘం సభ్యులు 150 మంది 41 వరుసలతో పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చ, సునేరుతో పెద్దపట్నాన్ని తీర్చిదిద్ది నిమ్మకాయతో చిత్ర కన్న నెలకొల్పారు. మరోవైపు మల్లన్న కథను ఒగ్గు కళాకారులు భక్తులకు ఆలకింపచేసారు. ప్రభపూజారులు ఊరేగింపుగా పోతరాజుల వేషధారణ విన్యాసాలతో అలరించారు. ఒగ్గుపూజారులు మల్లన్నబోనాలను తీసుకొచ్చిన అనంతరం పట్నంపైపెట్టి స్వామికి నైవేద్యం సమర్పించారు. పట్నానికి నలువైపులా గుమ్మడికాయలు, నిమ్మకాయలతో బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారి ఉత్సవవిగ్రహాలను తీసుకువచ్చి, పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించారు. పెద్దపట్నాన్ని తిలకించిన భక్తులు మల్లన్నను స్మరిస్తూ పట్నంపై నడిచి తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలి రావడంతో తోటబావి ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటక లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీ శర్మ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మల్లన్న పట్నాన్ని తొక్కడానికి భక్తులకు అనుమతించిన సమయంలో కొందరు తొందరగా వెళ్లాలని పది అడుగుల ఎత్తు భారీకేడ్లపై నుంచి దూకారు. దీంతో పోలీసులు లాఠీలకు పనిజెప్పి అదుపు చేశారు. పెదపట్నం ముగిసిన అనంతరం వీరశైవార్చకులు గర్భాలయంలో అన్నపూజ నిర్వహించారు.


గర్భాలయంలో మహా అన్నపూజ


ఉత్సవమూర్తులను తోటబావికి తీసుకొస్తున్న వీరశైవార్చకులు

కోనేటిలో మురుగు నీరు

అత్యంత విశిష్టమైన మహాశివరాత్రి సందర్భంగా శుక్ర, శనివారాల్లో వచ్చిన భక్తులు మురికి నీటిలోనే పుణ్య స్నానాలను ఆచరించారు. వేలాదిగా భక్తులు వచ్చి కోనేటిలో స్నానాలు చేస్తారని తెలిసి కూడా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు నీటిని శుభ్రపరచడంలో నిర్లక్ష్యం వహించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్వర్ణ


స్వర్ణను సన్మానిస్తున్న సంతోష్, గ్రామస్థులు

మద్దూరు, మార్చి 9: మద్దూరు మండలం గాగి ళ్లాపూర్ గ్రామానికి చెందిన గుడిసె స్వర్ణ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేక సంతోష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ 16 నుంచి 20 వరకు దాద్రానగర్ హవేలిలో జరిగే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, సభ్యులు నర్సింహులు, సాయికుమార్, మద్దూరు మోడల్ స్కూల్ ఛైర్మన్ బాలస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేష్, అంజయ్య పాల్గొన్నారు.

మహిళలకు ఈ నెలాఖరు వరకు ఉచిత ఓపీ

● వెల్‌నెస్ హాస్పిటల్ ఎండీ డా.లాలేష్


మాట్లాడుతున్న వెల్‌నెస్ హాస్పిటల్ ఎండీ డా.లాలేష్, గైనకాలజిస్ట్ డా.ఆలియారూహి

సంగారెడ్డి అర్బన్, మార్చి 9: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి చౌరస్తాలోని వెల్‌నెస్ హాస్పిటల్ ఈ నెలాఖరు వరకు ఉచిత ఓపీ ద్వారా మహిళలకు వైద్య సేవలందించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డా.లాలేష్, గైనకాలజిస్ట్ డా.ఆలియారూహి తెలిపారు. సంగారెడ్డిలోని వెల్‌నెస్ హాస్పిటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలు ఎక్కువగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే అన్నివిధాలా ప్రయోజనం ఉంటుందని, ఈ నేపథ్యంలో మహిళల ఆరోగ్యపై ప్రత్యేక దృష్టిసారించి ఉచిత వైద్య చికిత్సలు అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మహిళల్లో ఎలాంటి అనారోగ్య సమస్యకైనా ఉచితంగా వైద్య సేవలందించేందుకు తమ ఆస్పత్రి సిద్ధంగా ఉన్నదన్నారు. సంగారెడ్డి పట్టణంతో పాటు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాంచ్ హెడ్ ఎం.చిన్నా, హెచ్ఆర్ డేవిడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు హుస్నాబాద్‌లో హాఫ్ మారథాన్

● హాజరుకానున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్ టౌన్, మార్చి 9: హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట రోడ్డు స్తూపం వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసుశాఖ, రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్‌తో పాటు 10కే, 5కే రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. హాఫ్ మారథాన్‌కు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ పోటీలకు దాదాపు 1200 మంది యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రన్నింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల వెంకట్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

కుష్ఠును అరికట్టేలా..

- ‘ఎల్‌సీడీసీ’ పేరిట ఆరోగ్యశాఖ ఇంటింటికి
- 11 నుంచి 24 వరకు ఆశాల సర్వే
- సర్వే ద్వారా ‘కుష్ఠు’ అనుమానితుల గుర్తింపు
- వ్యాధి నిర్ధారణ కోసం పీహెచ్‌సీ డాక్టర్ల వద్దకు సిఫారసు
- ట్రీట్‌మెంట్ ప్రారంభానికి వైద్య ఆరోగ్యశాఖ చర్యలు



సంగారెడ్డిలో ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు, అధికారులు(ఫైల్)



సంగారెడ్డి అర్బన్, మార్చి 9: చర్మంపై స్పర్శలేని మచ్చలు, ఇతర మచ్చలున్నాయా? అంటూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి రానున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ)పేరిట వైద్య ఆరోగ్యశాఖ సర్వే నిర్వహించనున్నది. ఈ నెల 11 నుంచి 24వ తేదీవరకు ఆశావర్కర్లు సర్వే చేయనున్నారు. ఏటా చర్మ వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. చర్మానికి, నరాలకు సోకి ఇబ్బంది పెట్టే ఈ కుష్ఠు చాప కింద నీరులా విస్తరించి భయాందోళనకు గురిచేస్తున్నది. దీనిని ఆదిలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఇదే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఎల్‌సీడీసీ పేరిట కుష్ఠు బాధితుల గుర్తింపు సర్వే చేయిస్తున్నారు.

గతేడాది తరహాలో..

సంగారెడ్డి జిల్లాలో 16,13,998 జనాభా ఉన్నారు. గతేడాది ఆగస్టులో వైద్య ఆరోగ్యశాఖ ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించింది. ఆ క్రమంలో 3,31,916 ఇళ్లకు వెళ్లి సర్వే చేయగా 5103 మంది కుష్ఠు అనుమానితులున్నట్లు గుర్తించగా, అందులో 23 మందికి కుష్ఠు ఉన్నట్లు తేలినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది అదేరకంగా సర్వే చేయాలని ఇప్పటికే ఆశా కార్యకర్తలకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.

ఆశాలతో ఇంటింటి సర్వే

జిల్లాలోని పట్టణ, గ్రామాల్లోని ప్రతి ఇంటింటి ఆశా వర్కర్లు వెళ్లి సర్వే చేస్తారు. జిల్లాలోని 34 ఆరోగ్య కేంద్రాల పరిధులలో 928 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. సర్వే చేసినందుకుగాను ప్రతి ఆశా కార్యకర్తకు ఒకరోజుకు రూ.75 చొప్పున చెల్లిస్తారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా ప్రతి ఆశా కార్యకర్త ఒక్కోరోజు రూరల్ ఏరియాలో 15-20 ఇళ్లు, అర్బన్ ఏరియాల్లో 20-25 ఇళ్లను సర్వే చేస్తారు. శరీరంపై తెల్ల మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారిపోవడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలుంటే వివరాలు నమోదు చేసుకుంటారు. వీరిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దృష్టికి తీసుకెళ్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని మరోసారి లెప్రసీ బృందం చేత పరీక్షలు చేయిస్తారు. వ్యాధి ఉన్నట్లు తేలితే ఎండీటీ డ్రగ్స్ లెప్రసీ చికిత్స ప్రారంభిస్తారు.

ఆదిలోనే గుర్తిస్తేనే మేలు

కుష్ఠు ప్రధానంగా మైకోబ్యాక్టీరియం లెప్రె అనే బ్యాక్టీరియా వల్లా సంక్రమిస్తుంది. కుష్ఠు ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్ల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వయసు, లింగ బేధం లేకుండా ఎవరికైనా ఈ వ్యాధి సోకవచ్చు. వంశ పారంపర్యంగా ఈ వ్యాధి సంక్రమించదు. శరీరంలో ఏ భాగంలోనైనా సోకవచ్చు. కుష్ఠు బాధితులు ఎండీటీ మందులు 6 నుంచి 12 నెలలు వాడితే పూర్తిగా నయమవుతుంది. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స చేయించుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. వ్యాధిపై అవగాహన లేనివారు సరైన సమయంలో వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఇది తీవ్ర రూపం దాల్చుతోంది.

కుష్ఠు రహిత సమాజాన్ని సాధిద్దాం



జిల్లాలో ఈ నెల 11 నుంచి ఎల్‌సీడీసీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే మెడికల్ ఆఫీసర్లు, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చాం. కుష్ఠు అనుమానితులను గుర్తించి వారందరికీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి సరైన చికిత్స అందిస్తాం. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తారు. సర్వేకు వచ్చే ఆశాలకు ప్రజలు సహకరించాలి. కుష్ఠు నిర్మూలనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. కుష్ఠు రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

- డాక్టర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్, సంగారెడ్డి జిల్లా

లింగారెడ్డిపేట్‌లో భారీ చోరీ

- 50 తులాల ఐదు బంగారు బిస్కెట్లు, 18 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో తనిఖీ చేస్తున్న క్లూస్‌టీం

మనోహరాబాద్, మార్చి 9: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామంలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాదాసు రమేష్ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వెంకటాయపల్లికి చెందిన మామ బొబ్బిళ్ల సత్తయ్య పదిరోజుల క్రితం మృతిచెందాడు. ఈనెల 6న దశదిన కర్మ కోసం రమేష్ కుటుంబసభ్యులతో వెంకటాయపల్లికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాగా శుక్రవారం రాత్రి రమేష్ ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. మంచం కింద కబోర్డులో ఉన్న 50 తులాల ఐదు బంగారు బిస్కెట్లు, బీరువాలో ఉన్న 18 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమందించాడు. శనివారం సీఐ కృష్ణతో పాటు ఎస్ఐ క్లూస్‌టీంతో వచ్చి పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు. తమ కూతుళ్ల పెళ్లిళ్ల కోసం దాచిన బంగారం చోరీకి గురైందని, కూతుళ్ల పెళ్లిళ్లు ఎలా చేయాలని రమేష్ వాపోయాడు.

ఉడికీ.. ఉడకని అన్నం తినేదెట్లా..?

- గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆందోళన



ఉడికీ ఉడకని అన్నం

హత్నూర, మార్చి 9: మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మధ్యాహ్నం ఉడికీ ఉడకని అన్నం వండి పెట్టడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కొంతకాలంగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వంటలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. చాలాసార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. నాణ్యమైన భోజనం ఏర్పాటు చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఎట్టకేలకు ప్రిన్సిపాల్ జోక్యం చేసుకుని విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



కిష్టయ్య మృతదేహం

వర్గల్, మార్చి 9: చేపల వేటకోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ తునికిఖాల్సా గ్రామానికి చెందిన మన్నె కిష్టయ్య(50) శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లివస్తానని భార్య అనసూయకు చెప్పాడు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం గ్రామ సమీపంలోని తపాల్‌ఖాన్ చెరువు నీటి ఒడ్డున అతని దుస్తులు కనిపించాయి. చెరువులో పరిశీలించగా కిష్టయ్య మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. మృతుడి కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..



భిక్షపతి(ఫైల్)

నర్సాపూర్, మార్చి 9: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. నర్సాపూర్ మండలం మాడాపూర్ గ్రామానికి చెందిన నవాపేట భిక్షపతి(45) పొలానికి నీళ్లు పెట్టేందుకు శనివారం ఉదయం కొడుకుతో కలిసి వెళ్లాడు. కాగా బోరు మోటారు నుంచి ఉన్న సర్వీస్ వైరు ఊడిపోవడంతో దానిని సరిచేసే క్రమంలో షాక్‌కు గురై భిక్షపతి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై కొడుకు పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నార్లపూర్‌లో తల్లి, కూతురు అదృశ్యం



తల్లి, కూతురు (ఫైల్)

నిజాంపేట, మార్చి 9: తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన నిజాంపేట మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన గోదూరి శ్యామల(28), తన భర్త బాలరాజుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి, దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్యామల.. కూతురు రిషిత(8)ను తీసుకుని మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆందోళన చెందిన భర్త చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



వట్‌పల్లిలో ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రాజనర్సింహ

వట్‌పల్లి, మార్చి 9: ప్రజలకు మౌలిక సదుపాయాలు, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం వట్‌పల్లిలో రూ.11.20 కోట్లతో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి, రూ.2.60 సీసీరోడ్డు నిర్మాణం, గౌతాపూర్ నుంచి గొర్రెకల్ గ్రామం వరకు రూ.1.30 కోట్లతో పార్మేషన్ రోడ్డు నిర్మాణం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో గ్రామాలలో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వట్‌పల్లిలో నిర్మించనున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్‌జ్యోషి, ఎంపీపీ పత్రి కృష్ణవేణి, జడ్పీటీసీ పత్రి అపర్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకటఖ్వాజా ఉర్సులో మంత్రి

వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా 39వ ఉర్సు శనివారం అట్టహాసంగా ఇందులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ హాజరై ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంధం తలపై పెట్టుకుని ఆశ్రమంలోని దర్గాకు తీసుకెళ్లగా ఆశ్రమ ట్రస్టు సభ్యులు వీరికి ఘనస్వాగతం పలికారు.

కాలుష్య నియంత్రణపై గత ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు

- ఇందిరాగాంధీ దయతోనే పాశమైలారం పారిశ్రామికవాడ ఏర్పాటు
- స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు
- జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ధ్యేయంగా ప్లాంట్ ఏర్పాటు
- కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించిన మంత్రులు



కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్, మంత్రులు

పటాన్‌చెరు రూరల్, మార్చి 9: కాలుష్య నియంత్రణపై గత ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, ఇందులో భాగంగా పాశమైలారం పారిశ్రామికవాడలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ధ్యేయంగా కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేశామని శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం పాశమైలారం పారిశ్రామికవాడలో రూ.104 కోట్లతో నిర్మించిన కాలుష్య జలాల శుద్ధి కర్మాగారాన్ని మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాంకీ యాజమాన్యం ఇంత మంచి కర్మాగారాన్ని స్థానికంగా ఏర్పాటు చేయడం హర్షించతగ్గ విషయమన్నారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ సభ్యురాలిగా 1980లో ఇందిరాగాంధీ పాశమైలారం పారిశ్రామికవాడను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి పునాది వేశారన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలను తీసుకుని ఇతర వ్యాపారాలు సాగించిన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. 480 కిలో లీటర్ల పారిశ్రామిక మురుగునీటిని శుద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఈ ప్లాంట్ జీరో లిక్విడ్ డిశ్చార్జ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్‌రంజన్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, సస్టైనబిలిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతం రెడ్డి, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీఎస్ ఐఐసీ సీఈవో మధుసూదన్, ఐలా నాయకులు దుర్గాప్రసాద్, కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాట శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న స్పీకర్

పోతంశెట్‌పల్లి వైన్స్ వద్ద నయా మోసం

- ఆన్‌లైన్ పనిచేయడం లేదని చెబుతున్న వైన్స్ యజమానులు
- ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని రూ.100కు అదనంగా రూ.20 నుంచి రూ.50 వసూలు
- చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు



పోతంశెట్‌పల్లి వైన్స్ వద్ద ఆన్‌లైన్ పనిచేయడం లేదని చూపిస్తున్న భక్తులు

కొల్చారం, మార్చి 9: జాతరకు వచ్చే భక్తులకు కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి వైన్స్ యజమానులు శఠగోపం పెడుతున్నారు. పే యాప్‌లు పనిచేయడం లేదని ప్రైవేట్ వ్యక్తులను వైన్స్ వద్ద ఏర్పాటు చేసుకుని రూ.100కు అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. సుమారు 10 మంది యువకులను వైన్స్ వద్ద ఏర్పాటు చేసుకుని ఈ తతంగం నడిపిస్తున్నారు. దీంతో జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైన్స్ ముందు బారికేడ్లను ఏర్పాటుచేసి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. వైన్స్ దుకాణం వద్ద భక్తులు అడిగిన బ్రాండ్ మద్యం ఇవ్వకుండా.. ఆ బ్రాండ్ కావాలంటే ఫలానా (జాతరలో ఏర్పాటు చేసిన) బెల్ట్‌షాపునకు వెళ్లాలని సూచిస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. అక్కడికి వెళ్లి బ్రాండ్ అడిగితే క్వార్టరుకు రూ.20 నుంచి రూ.50 అధికంగా వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్, పోలీస్‌శాఖ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పోతారం(ఎస్)లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 9: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎస్ఐ మహేష్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతిఏటా కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో 56 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకుడు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనిత, ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో మహిళల పాత్ర కీలకం



ఎంసీహెచ్ డాక్టర్లు, సిబ్బందిని సన్మానిస్తున్న సాథ్వి చారిటబుల్ సొసైటీ బృందం

మెదక్ అర్బన్, మార్చి 9: వైద్య రంగంలో మహిళల పాత్ర కీలకమని డీసీహెచ్‌ఎస్ డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాథ్వి చారిటబుల్ సొసైటీ అధ్యక్షురాలు లత ఆధ్వర్యంలో శనివారం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీహెచ్ డాక్టర్లతోపాటు ఆసుపత్రిలోని ప్రతి విభాగంలోని మహిళా సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ డా. శివదయాళ్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యోత్సవ ఫెస్టివల్‌కు దేవేందర్‌కు ఆహ్వానం

హుస్నాబాద్‌రూరల్, మార్చి 9: ఢిల్లీలో ఈనెల 11 నుంచి 16 వరకు నిర్వహించే సాహిత్య ఉత్సవాలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన కవి, రచయిత అన్నవరం దేవేందర్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర సాహిత్య అకాడమి కార్యదర్శి శ్రీనివాసరావు ఆయనను లేఖ ద్వారా ఆహ్వానించారు. 21వ శతాబ్దపు భారతీయ కవిత్వం, కవి సమ్మేళనంలో దేవేందర్ తన కవితను చదవాల్సిందిగా లేఖలో పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ 70 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆరురోజుల పాటు కొనసాగే సమ్మేళనంలో 175 భాషల నుంచి రచయితలు, కవులు పాల్గొని తమ కవితలను చదివి వినిపించనున్నట్లు దేవేందర్ పేర్కొన్నారు. ప్రపంచస్థాయిలో జరిగే అతిపెద్ద సాహితీ ఉత్సవాలకు దేవేందర్‌కు ఆహ్వానం రావడం పట్ల పోతారం(ఎస్) గ్రామస్థులు అభినందించారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

శివపార్వతుల కల్యాణాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, నిర్వహించారు. పెద్దపట్నం రచించి మల్లన్న కల్యాణం ఘనంగా జరిపారు. స్వామివార్ల కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రాయపోల్, మార్చి 9: మండలంలోని రామారం మహాదేవుని ఆలయం వద్ద పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో రుద్రహోమం నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామవీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో మాజీ సర్పంచులు వంజరి సరోజన, హన్మంతు, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. రామారం కల్యాణోత్సవంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

● **చేర్యాల:** మల్లన్న, శివపార్వతుల నామస్మరణతో చేర్యాల మార్మోగింది. చేర్యాల పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపారు. అలాగే పట్టణంలోని చిన్నిమల్లన్న దేవాలయంలో పెద్దపట్నం రచించి మల్లన్న కల్యాణం జరిపారు. పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు చేపట్టారు. పట్టణవాసులు అధికసంఖ్యలో హాజరై మల్లన్నను దర్శించుకున్నారు. అలాగే రామలింగేశ్వరాలయం, ఓం నమఃశివాయ ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని చుంచనకోట గ్రామంలోని మల్లన్న ఆలయంలో పెద్దపట్నం వేసి కల్యాణం జరిపారు. వీరన్నపేట గ్రామంలోని పర్వతాల మల్లన్న ఆలయంలో పట్నం రచించి అగ్నిగుండాలు నిర్వహించారు.

● **కొండపాక:** మహాశివరాత్రి సందర్భంగా భక్తుల శివనామ స్మరణ మధ్య శివపార్వతుల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మర్పడగ విజయదుర్గ సమేత సంతానం మల్లికార్జున స్వామి క్షేత్రంలో క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో అర్చకులు శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే కొండపాక రుద్రేశ్వరాలయంలో ట్రస్టు ప్రతినిధి మరుమాముల వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. కొండపాకలోని రుద్రేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. అలాగే మర్పడగ క్షేత్రంలో నందీశ్వరునికి అనంత ఘటాభిషేకం నిర్వహించారు. దేవాలయం ఆవరణలో అగ్ని గుండాలు, పెద్దపట్నం వేశారు.



చేర్యాల పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● **మర్కుక్:** మండలంలోని నర్సన్నపేట గ్రామ శివారులో వెలిసిన మల్లికార్జునస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ముఖ్య అతిథులుగా మర్కుక్ మండల ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డిలు హాజరయ్యారు. కార్యక్రమంలో మర్కుక్ ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బీబీఆర్ యాదవ సంఘం అధ్యక్షుడు నర్సింలు, గ్రామ నాయకులు రవీందర్‌రెడ్డి, బూకల మల్లేశం, వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి, ఎంబరి వెంకటేశ్, బూకల వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఒగ్గు పూజారి, యాదగిరి పాల్గొన్నారు.

● **వర్గల్:** మండలంలోని మల్లారెడ్డిపల్లిలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు ఆయనను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, తాజా మాజీ ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



రాయపోల్ మండలం రామారంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణ దృశ్యం

● **మిరుదొడ్డి:** అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతె గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీరామలింగేశ్వరాలయ జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాజామాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు. మండలంలోని అల్వాల గ్రామంలోని శివాలయం వద్ద అన్నదాన చేశారు. కార్యక్రమంలో అన్నదాత శేషు, ప్రకాష్, తాజామాజీ సర్పంచు కిష్టయ్య, ప్రవీన్, ప్రతాప్ పాల్గొన్నారు.



కొండపాక: విజయదుర్గ సమేత సంతానం మల్లికార్జున స్వామి ఆవరణలో పెద్దపట్నం

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

జగదేవ్‌పూర్, మార్చి 9: శివరాత్రి సందర్భంగా మండలంలోని తిగుల్ గ్రామంలో పార్వతీపరమేశ్వర ఆలయంలో శనివారం తెల్లవారుజామున కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అగ్ని గుండ ప్రవేశం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి శివాలయం వరకు డప్పు చప్పుల్లు, పోతరాజుల నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. అలాగే జగదేవ్‌పూర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



తిగుల్‌లో ఎడ్లబండ్ల ఊరేగింపు దృశ్యం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ములుగు, మార్చి 9: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాజీ ఎంపీటీసీ సురేందర్ మృతి చెందాడు. ములుగు మండలం అచ్చాయపల్లి గ్రామానికి చెందిన నక్కిర్తి సురేందర్ రెండు పర్యాయాలు ఎంపీటీసీగా పనిచేశారు. అలాగే ఒకసారి సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కొద్ది రోజులుగా అల్వాల్ పరిధిలోని దమ్మాయిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.



సురేందర్(ఫైల్)

ఎంపీడీవో కార్యాలయానికి మిషన్ భగీరథ నీళ్లు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మద్దూరు, మార్చి 9 : మద్దూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి మిషన్‌భగీరథ నీటి సరఫరాను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పునరుద్ధరించారు. మార్చి 7న ఎంపీడీవో కార్యాలయానికి 'ట్యాంకర్లతో వంతుల వారీగా నీటి సరఫరా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మి మాట్లాడారు. నీటి సరఫరా పైపులు జామైనా, ఏదైనా ఇబ్బందులున్నా గ్రామపంచాయతీకి తెలియజేయాలన్నారు. కేబుల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన వర్కర్లు కేబుల్ కోసం తవ్విన గుంతల మూలంగా నీటి సరఫరా ఆగిపోయిందని, దాన్ని గ్రామ పంచాయతీ వారు పునరుద్ధరించారని ఆమె తెలిపారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

మర్కుక్, మార్చి 9: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో ఎర్రవల్లి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలిబాల్ టోర్నమెంట్‌ను మండల ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఒత్తిడి నుంచి దూరం చేస్తాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ చింతకాయల స్వామి, మర్కుక్ ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్, తాజా మాజీ సర్పంచ్ భాగ్యా బిక్షపతి, ప్యాక్స్ వైస్ చైర్మన్ బాల్రాజు, మర్కుక్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీపై గ్రామసభ

దూళిమిట్ట మార్చి9: మండలంలోని లింగాపూర్ గ్రామంలో 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీని ఈ నెల 4వ తేది నుంచి 9వ తేది వరకు నిర్వహించారు. చివరిరోజు ప్రత్యేక గ్రామసభ నిర్వహించి, నాలుగు రోజులుగా జరిగిన తనిఖీలలో పరిశీలించిన ఉపాధిహామీ పనుల వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. ఉపాధిహామీలో జరిగిన పనులు రైతులకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని డీఆర్‌పీ సుధీర్ పేర్కొన్నారు. .కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వినయ్ రెడ్డి, పంచాయతి సెక్రటరీ రాజుగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం పాల్గొన్నారు.



గ్రామసభలో అధికారులు

అభివృద్ధిపై మాట్లాడే అర్హత ఉందా

● మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, మార్చి 9: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన అభివృద్ధిపై మాట్లాడే అర్హత కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఉందా అని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ పరిధిలో నయా పైసా అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. అమలు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఆగం చేస్తున్నదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, బీఆర్‌ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్ గుప్తా, శ్రీనివాసరావు, మహేందర్‌రెడ్డి, కచ్చు రాజయ్య, శేఖర్ బాబు, శ్రీనివాస్, దేవయ్య, రాజు, మోహన్, బాల నర్సు, తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

ప్రజాభిమానాన్ని చూరగొన్న కాంగ్రెస్ ప్రభుత్వం

● డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు, మార్చి 9: అనతి కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభిమానాన్ని చూరగొని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్, మర్మాముల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దవూట్ల భూపతిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బత్తిని సిద్దులు నాయకులు పెద్దవూట్ల కర్ణాకర్‌రెడ్డి, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, గద్దల మహేందర్, ముస్త్యాల మనోహర్, పర్శరాములు, బందారం శ్రీనివాస్, కత్తుల భూపాల్‌రెడ్డి, ఆలేటి విష్ణు, బియ్య రాజు, ప్రేమ్ కుమార్, భాస్కర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



సలాఖ్‌పూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

'రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాలి'

చేర్యాల, మార్చి 9 : చేర్యాల ప్రాంతంలో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని, వెంటనే తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించి, పంటలను కాపాడి రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పుల మహేశ్, అరిగె కనకయ్య అన్నారు. చేర్యాల పట్టణంలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడూ పంటలు ఎండిపోలేదని, పంటకు సరిపడా సాగునీరందించడంతో ఎటుచూసినా పచ్చని పంట పొలాలు దర్శనమిచ్చి రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా పంటలు ఎండిపోతున్నాయన్నారు. వీరివెంట రవి, యాదగిరి, భాను తదితరులున్నారు.

పల్లె ప్రకృతివనానికి ట్యాంకర్‌తో నీటి సరఫరా

మద్దూరు, మార్చి 9 : మద్దూరు మండలంలో ఎండలు తీవ్రం కావడంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలను కాపాడుకునేందుకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. మద్దూరు మండల కేంద్రంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం సంరక్షణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీటిని అందిస్తున్నారు.

ఐక్యత ఉంటే దేనినైనా సాధించవచ్చు

● సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ



వివిధ రంగాల కళాకారులను సన్మానిస్తున్న అప్పాల ప్రసాద్‌జీ

మిరుదొడ్డి, మార్చి 9: ఐక్యంగా ఉండడం ద్వారా అనుకున్నది సాధించవచ్చునని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ పేర్కొన్నారు. మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన 65మంది కళాకారులను ఆయన శాలువతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రామాయణం, మహాభారతం, భాగవతంతోపాటు వివిధ పౌరాణిక ఇతివృత్తంలో కథలు, నాటకాలు, భజనలతో సమాజాన్ని జనజాగృతం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్‌బాబు, జిల్లా కార్యదర్శి సంతోష్, సుమన్, పోశయ్య, పర్శరాములు, సంతోష్, మహేష్, కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బైకుపై నుంచి పడి వ్యక్తి మృతి

మేడ్చల్ టౌన్, మార్చి 9 : బైకుపై నుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా కొల్తూరు గ్రామానికి చెందిన బాబు శంకర్(40) శుక్రవారం రాత్రి తన బైకుపై ఇంటికి వెళ్తుండగా మండలంలోని సోమారం గ్రామం వద్ద బైక్ స్కిట్ అయింది దీంతో బైక్ జారుతూ రోడ్డు డివైడర్‌కు ఢీ కొనటంతో శంకర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'లెప్రసీ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలి'

మద్దూరు, మార్చి 9 : మద్దూరు మండలం లద్నూరు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని వైద్యాధికారి సువర్ణసన్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్చి 11 నుంచి మొదలయ్యే లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను ఆశాలు, ఏఎన్ఎంలు విజయవంతం చేయాలని సూచించారు.

మహిళా హోంగార్డుకు సన్మానం

జోగిపేట, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో మహిళా హోంగార్డును సన్మానించారు. స్థానిక హోంగార్డు సునీతను ఎస్‌ఐ అరుణ్ కుమార్‌గౌడ్, శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గౌస్‌తోపాటు, సిబ్బంది శ్రీనివాస్, సంజీవ్ కుమార్, సంతు పాల్గొన్నారు.

విగ్రహాల తొలగింపునకు నిరసనగా గిరిజనుల రాస్తారోకో

చేగుంట మార్చి 9: తమ ఆరాధ్య దైవాలైన సేవాలాల్, జగదాంబ విగ్రహాలను తొలగిం.చి తమను అవమానించారంటూ చేగుంట మండలం రెడ్డిపల్లి చౌరస్తా వద్ద గిరిజనులు, లంబాడీ సంఘం నాయకులు శనివారం 44వ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో సుమారు గంటకు పైగా వాహనాలు నిలచిపోయాయి. సంఘం నాయకులు సుభాష్ నాయక్, చక్రిపింగ్‌లు మాట్లాడుతూ గత 7 ఏళ్లుగా తాము ఇక్కడ పూజలు, జాతరలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చేగుంట ఎస్‌ఐ బాలరాజు వారి శాంతింపచేసి న్యాయం జరిపిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళకారులు శాంతించారు.

'మల్లన్నసాగర్ నుంచి సాగునీరు అందించాలి'

కొండపాక, మార్చి 9 : కొండపాక మండలం బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా, దుద్దెడ గ్రామాల్లోని చెరువులను మల్లన్న సాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ల ద్వారా నీటిని నింపాలని ఆయా గ్రామాల రైతులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. దుద్దెడకు శనివారం ఆయన వచ్చిన సందర్భంగా రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ నాలుగు గ్రామాలకు సాగునీరు రావడంలేదని కాలువల ద్వారా సాగునీటిని అందించి ఈ ప్రాంతా రైతులను ఆదుకోవాలని కోరారు.

రంగనాయకసాగర్ ప్రాజెక్టులోకి నీటిని పంపింగ్ చేయాలి

● ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, మార్చి 9: రంగనాయక సాగర్ ప్రాజెక్టులోకి 1 టీఎంసీ నీటిని పంపింగ్ చేయాలని చిన్నకోడూర్ మండలం ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడారు. మిడ్ మానేరులో నీటి నిల్వ ఉన్నప్పటికీ, అనంతగిరి (అన్నపూర్ణ) ప్రాజెక్టులోకి నీటిని ఎందుకు పంపింగ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టులోకి 01టీఎంసీ నీటిని పంపింగ్ చేస్తే పంటలు ఎండిపోయే పరిస్థితి అసలు ఉండదని అన్నారు.

నిధులు విడుదల చేసి ఆదుకోండి

● పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి

ములుగు, మార్చి 9: ప్రభుత్వం అన్ని పథకాలు అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటుందని ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి విమర్శించారు. ములుగులో ఉయన శనివారం మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పెళ్లిల్లు చేసుకున్న వారికి కల్యాణలక్ష్మి పథకం డబ్బులు అందించి పేదలను ఆదుకున్న ఘనత బీఆర్‌ఎస్ పార్టీదే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఇప్పటికే ఎంతోమంది వివాహాలు చేసుకుని కల్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కల్యాణలక్ష్మి చెక్కులు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్రీడా ప్రాంగణాలను తనిఖీ చేసిన సోషల్ ఆడిట్ బృందం



మద్దూరులో క్రీడాప్రాంగణంలోని పరికరాల కొలతలు తీసుకుంటున్న ఆడిట్ బృందం

మద్దూరు, మార్చి 9 : మద్దూరు మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో నిర్వహించిన పనుల్లో భాగంగా శనివారం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను సోషల్ ఆడిట్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. మద్దూరు, ధర్మారం గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలలో ఏర్పాటు చేసిన పరికరాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా లేవా అనే విషయాలపై ఆరా తీశారు. వాటి కొలతలు తీసుకోవడంతో పాటు మట్టి పనులు జరిగిన తీరు, భూమి చదును, లేబర్ వర్క్, ఏ మేరకు జరిగిందనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ వెంకటేశ్వర్లు డీఆర్పీ యాకబ్, టీఏ మాధవి ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

దుబ్బాక, మార్చి9: అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు హెచ్చరించారు. శనివారం తెల్లవారుజామున ముస్తాబాద్ మండలంలోని గూడెంవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసునమోదు చేసినట్టు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూరు, మార్చి 9 : మద్దూరు మండలం వల్లపంట్ల గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

గజ్వేల్‌లో ఫ్లాగ్‌మార్చ్

గజ్వేల్, మార్చి 9: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం కేంద్ర బలగాలు, సీఐఎస్ఎఫ్‌తో ఆధ్వర్యంలో శనివారం గజ్వేల్ పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా, కోట మైసమ్మ టెంపుల్, పాండవుల చెరువు, ఎస్సీ కాలనీ, ఎల్లమ్మ టెంపుల్, శివాజీ విగ్రహం, పిడిచెడ్ రోడ్, హాస్పిటల్ చౌరస్తా, గుర్రపు బొమ్మ, కోర్టు చౌరస్తా, ప్రజ్ఞాపూర్ రోడ్, అంబేద్కర్ సర్కిల్, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, తదితర ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌పై హర్షం

మెదక్ అర్బన్, మార్చి9: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల టీఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఆర్‌కే రావు, మెదక్ రిజియన్ అధ్యక్షుడు పీఎస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన 2017 పే స్కేల్‌తోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బాండ్స్ డబ్బులు ఇవ్వడం సంతోషకరమన్నారు.

ముగిసిన ధరణి స్పెషల్ డ్రైవ్

దూళిమిట్ట, మార్చి9: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 9 వరకు నిర్వహించిన ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ముగిసినదని దూళిమిట్ట తహసీల్దార్ ఏర్రోళ్ల శ్యామ్ తెలిపారు. మెత్తం 95 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 29 పరిష్కరించామని, 61 దరఖాస్తులకు సరియైన పత్రాలు లేకపోవడంతో తిరస్కరించినట్లు తెలిపారు. మరో 5 రఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

వాటర్ ప్లాట్ ఏర్పాటు అభినందనీయం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, మార్చి 9: మల్లారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ సొంత నిధులతో ప్రజల కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గ్రామంలో జైపాల్‌రెడ్డి ప్రజల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యం నాయకుడిలో ఉండాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించనప్పుడే నిజమైన నాయకుడు అనిపించుకుంటారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు దేవగనిక నాగరాజు, మండల యూత్ అధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అనాలోచిత నిర్ణయాల వల్ల హుస్నాబాద్ నిరుద్యోగులకు అన్యాయం

హుస్నాబాద్, మార్చి 9: బీఆర్‌ఎస్ అనాలోచిత నిర్ణయాల వల్ల హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సింగరేణి ఉద్యోగాలకు అర్హత కోల్పోయారని నిరుద్యోగులు నరేష్, తిరుపతి, రమేశ్, హరీష్, అరవింద్‌లు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ మండలాలను సిద్దిపేట జిల్లాలో కలపడం వల్ల స్థానికత కోల్పోయామన్నారు. సింగరేణి ఉద్యోగాలకు 95 శాతం లోకల్, 5 శాతం నాన్‌లోకల్ వారికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈ మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నప్పుడు లోకల్ కిందకు వచ్చే వారమని, బీఆర్‌ఎస్ అనాలోచితంగా తమ మండలాలను సిద్దిపేటలో చేర్చడం వల్ల ఉద్యోగ అర్హత కోల్పోతున్నామని, దీనిపై ప్రభుత్వం ఇక్కడి నిరుద్యోగులకు అన్యాయం జరుగకుండా చూడాలని కోరారు.

బస్తీ దవాఖానాకు నోచుకోని చేర్యాల మునిసిపల్

చేర్యాల, మార్చి 9 : ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు గతప్రభుత్వం గ్రామాలలో పల్లె దవాఖానా, పట్టణ ప్రాంతంలో బస్తీ దవాఖానాలను నెలకొల్పినప్పటికీ, చేర్యాల మునిసిపల్‌లో మాత్రం ఇప్పటికీ నోచుకోలేదు. కొన్ని నెలలక్రితం బస్తీ దవాఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకున్నప్పటికీ, వైద్యశాఖ, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని కారణంగా కార్యరూపం దాల్చడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనువైన ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోవడంతో గతంలో నిర్మించిన కమ్యూనిటీహాళ్లను గుర్తించినప్పటికీ కుల, యువజన సంఘాల వారు అనాసక్తి కనబర్చడంతో భవనం ఖరారులో మల్లగుల్లాలు పడుతున్నారు. బస్తీ దవాఖానా కోసం ప్రభుత్వం రూ.13లక్షలు మంజూరు చేసి టెండర్లు కూడా పూర్తిచేసినప్పటికీ భవనాన్ని ఖరారు చేయకపోవడంతో నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ పాలకవర్గం, అధికారులు చొరవచూపి బస్తీ దవాఖానను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్వరూప

హుస్నాబాద్, మార్చి 9 : బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన తోట స్వరూపను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. స్వరూప మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఈ పదవి తనకి రావడానికి సహకరించిన బీజేపీ నాయకులకు స్వరూప కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపుకు అహర్నిషలు కృషి చేస్తానన్నారు.

మహిళల త్యాగాలు వెలకట్టలేనివి

సిద్దిపేట అర్బన్, మార్చి 9 : మగవారితో సమానంగా మహిళలు రాణిస్తున్నారని ప్రత్యేకాధికారి, ఎంపీవో శ్రీనివాసరావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ మహిళా సిబ్బందిని ఆయన, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య పాల్గొన్నారు.

● **సిద్దిపేటరూరల్:** మహిళల త్యాగాలు వెలకట్టలేమని గురుకులాల పేరెంట్స్ కమిటీ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మెట్ల శంకర్ అన్నారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ సిద్దిపేట జిల్లా కమిటీ, గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వైద్యరంగంలో సేవలందిస్తున్న శ్రీనివాస ఆర్థోపెడిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సముద్రాల దుర్గా, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మాధవిలను శాలువ కప్పి, జ్ఞాపిక అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్వేరోస్ ఇంటర్నేషనల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు, ఉపాధ్యక్షుడు ఎడ్ల ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శి భరత్ కుమార్, గురుకులాల పేరెంట్స్ కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గాజుల బాబు, మంద జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ మహిళలు దేశానికి ఆదర్శమని సిద్దిపేట రూరల్ మండల ఎంపీపీ ఉపాధ్యక్షుడు శేరుపల్లి యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని తోర్నాల, రావురుకుల గ్రామాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు మమత, శిల్ప, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులను శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రావురూకుల స్పెషల్ ఆఫీసర్, మండల పంచాయతీ అధికారి హరిప్రసాద్, మాజీ సర్పంచులు ఏల దేవయ్య, కవి తరపీందర్, ప్రముఖ న్యాయవాది బాబు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని కేజీబీవీలో సిద్దిపేట నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నారీశక్తి ఫిట్‌నెస్ పరుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థినిలు మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి గౌతమి, ఉపాధ్యాయుల బృందం, నెహ్రూ కేంద్ర వలంటీర్ నర్సింలు, ప్రవీణ్ పాల్గొన్నారు.



మిట్టపల్లిలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీవో శ్రీనివాసరావు